

జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌తో ప్రమాణం చేయిస్తున్న సీజే ఎంఎం శ్రీవాస్తవ

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా

జస్టిస్ వినోద్‌కుమార్ ప్రమాణం

ప్యారీస్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు నూతన న్యాయమూర్తిగా జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు ప్రాంగణంలో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో తడకమళ్ల వినోద్‌కుమార్ చేత మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహీంద్ర మోహన్ శ్రీవాస్తవ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు సీజే శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు కేంద్ర న్యాయశాఖ జాయింట్ సెక్రటరీ జగన్నాథ్ శ్రీనివాసన్ ఈ నెల 14న ఉత్తర్వులను జారీచేసిన విషయం తెలిసిందే. ప్రమాణస్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, అదనపు సొలిసిటర్ జనరల్, హైకోర్టు రిజిస్ట్రార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పలు న్యాయవాదు సంఘాల నిర్వాహకులు, తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ సభ్యులు పుష్పగుచ్ఛాలతో జస్టిస్ వినోద్‌కుమార్‌ను అభినందించారు.



మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

డీఎంకే నిలిపేసిన పథకాలను అధికారంలోకి వచ్చాక ప్రారంభిస్తాం

- రామనాథపురం సభలో ఈపీఎస్

ప్యారీస్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాజకీయ దురుద్దేశంతో డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిన అన్నాడీఎంకే పథకాలను అధికారంలోకి వచ్చాక పునఃప్రారంభిస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో ప్రచారం చేస్తున్న ఈపీఎస్ గురువారం రామనాథపురం నియోజకవర్గంలోని జాలర్లు, రైతులు, నేత కార్మికులు, పార్ట్‌టైమ్ టీచర్లు, అంగన్‌వాడీ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ, డీఎంకే అవినీతిని ఎండగడుతూ ఎంజీఆర్ స్థాపించిన అన్నాడీఎంకే రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషిచేసిందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వం అమలుపరిచిన పథకాలకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక రాజకీయ దురుద్దేశంతో డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు అన్నీ వర్గాల అండదండలతో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్ళీ అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు కొత్త పథకాలతో పాటు డీఎంకే నిలిపివేసిన పథకాలను కూడా అమలుచేస్తామన్నారు. శ్రీలంక జైళ్లలో శిక్ష అనుభవిస్తూ తమిళ జాలర్లు చిత్రహింసల పాలవుతున్నారని ఈ సమస్యను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి తమిళ జాలర్లకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టినట్లు ఈపీఎస్ తెలిపారు. రూ.14,400 కోట్లతో రూపొందించిన కావేరి-గుండారు పథకాన్ని అమలుచేశామని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన డీఎంకే ఈ పథకాలను అటకెక్కించిందని ఆరోపించారు. సాయంత్రం రామనాథపురం సంస్థానానికి వెళ్ళిన ఈపీఎస్, ఇటీవల అన్నాడీంకేలో చేరిన రామనాథపుర సంస్థాన యువరాజు నాగేంద్రసేతుపతి, ఆయన తల్లి, కుటుంబసభ్యులను పలకరించారు. అక్కడినుంచి రోమన్ చర్చి జంక్షన్ వరకు ఈపీఎస్ రోడ్‌షోలో పాల్గొన్నారు.



వేగంగా ప్రబలుతున్న

డెంగ్యూ

- హెచ్చరించిన ఆరోగ్యశాఖ

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డెంగ్యూ వ్యాప్తి అధికమవుతోంది. డెంగ్యూ లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో 10 జిల్లాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికమవుతోందని ఆరోగ్య శాఖ తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, విల్లుపురం, కడలూరు, కోవై, తంజావూరు, తేని, కన్నియాకుమారి తదితర జిల్లాల్లో డెంగ్యూ వ్యాప్తి క్రమక్రమంగా పెరుగుతోంది. ఆయా జిల్లాల్లో డెంగ్యూ ప్రబలేందుకు కారణమైన దోమల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాలువలు, వీధుల్లో దోమల మందు పిచికారి చేయడంతో పాటు ఇంటింటికీ వెళ్లి దోమల మందు ఫాగింగ్ చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే డెంగ్యూ నియంత్రణ ముందస్తు చర్యలకు ప్రజలు కూడా సహకరించాలని ఆరోగ్యశాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఆ ప్రకారం, ఇళ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది.

పది రోజుల తరువాత

- పథకాల ప్రారంభోత్సవాలతో బిజీ
- మదురైలో కొత్త జైలుకు శంకుస్థాపన

సచివాలయానికి సీఎం



వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అస్వస్థత కారణంగా చికిత్స పొందిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. పది రోజుల తరువాత గురువారం సచివాలయంలోకి అడుగుపెట్టారు.ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఈవీ వేలు, మూర్తి, గీతాజీవన్, సచివాలయ ఉన్నతాధికారులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన ఐదు పథకాలను ప్రారంభించారు. మదురైలో రూ.229 కోట్లతో నిర్మించనున్న కొత్త సెంట్రల్ జైలు భవనానికి శంకుస్థాపన చేశారు. ఐఐటీ, కేంద్ర విశ్వవిద్యాలయాలు, నేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ, నేషనల్ లా యూనివర్శిటీ, యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీలో అడ్మిషన్లు పొందిన ఆదిద్రావిడ, గిరిజన కులాలకు చెందిన 136 మంది విద్యార్థినీ విద్యార్థులకు లాప్‌టాప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూ.27.59 కోట్లతో, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో 13.54 కోట్లతో, జైళ్లశాఖ ఆధ్వర్యంలో రూ.60-లక్షలతో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. ఎక్సైజు శాఖలో ప్రభుత్వ సిబ్బంది పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగాలు పొందిన 39 మందికి నియామక పత్రాలు అందజేశారు. అదే విధంగా సామాజిక సంక్షేమ శాఖ, మహిళా హక్కుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో హిజ్రాల కోసం రూపొందించిన విధి విధానాలను ఆయన విడుదల చేశారు.

వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ కొత్తభవనాలు ...

సచివాలయంలో వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెంగల్పట్టు, తిరునల్వేలి సహా ఆరు జిల్లాల్లో రూ.27.04 కోట్లతో నిర్మించిన భవనాలు, కార్యాలయాలకు స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, ఎస్. ముత్తుసామి, ఈవీ వేలు, పి.మూర్తి, గీతాజీవన్, మదివేందన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి శిల్పా ప్రభాకర్ సతీష్, వాణిజ్య పన్నుల కమిషనర్ ఎస్.నాగరాజన్, రిజిస్ట్రేషన్ల శాఖ అధ్యక్షుడు దినేష్ పొన్‌రాజ్, చెన్నై నగర పోలీసు కమిషనర్ అరుణ్, అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ శాఖ డైరెక్టర్ సీమా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రకారం, ఆర్థిక శాఖ వ్యయ కార్యదర్శిగా ప్రశాంత్ ఎం.వడనేరె, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శిగా రాజగోపాల్ సుంకర, భూసర్వే శాఖ డైరెక్టర్‌గా దీపక్ జాకబ్, రవాణా శాఖ రోడ్డు భద్రత కమిషనర్‌గా గజలక్ష్మి, సహకార సంఘ మేనేజింగ్ డైరెక్టర్‌గా కవితా రాము నియమితులయ్యారు. అలాగే, నీటి సరఫరా, నీటిపారుదల బోర్డు మేనేజింగ్ డైరెక్టర్‌గా సమీరన్, మత్స్యశాఖ డైరెక్టర్‌గా మురళీధరన్, రెవెన్యూ నిర్వహణ కమిషనర్‌గా కిరణ్ కురాల, కోయంబత్తూర్ వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్‌గా రాక్రే శుభం జ్ఞానదేవరాలు, చెన్నై వాణిజ్య పన్నులు (అధిక పన్నులు చెల్లించే విభాగం) జాయింట్ కమిషనర్‌గా నారాయణ శర్మ తదితరులు నియమితులయ్యారు. రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సున్సోంగమ్ ఇడాక్‌సిరుకు అదనంగా సహజ వనరుల శాఖ కేటాయిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు.



వాకింగ్ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పలకరిస్తున్న మాజీ సీఎం పన్నీర్ సెల్వం

తలైవరే... సౌఖ్యమా?

- వాకింగ్ సమయంలో సీఎంకు తారసపడిన ఓపీఎస్
- మళ్లీ సాయంత్రం స్టాలిన్ ఇంట్లో భేటీ

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) గురువారం రెండుసార్లు కలుసుకుని రాజకీయ కలకలం సృష్టించారు. గురువారం ఉదయం అడయార్ కళాక్షేత్ర ప్రాంతంలో స్టాలిన్ వాకింగ్‌కు వెళ్తుండగా ఓపీఎస్ తారసపడ్డారు. ఇద్దరూ ఐదు నిమిషాలపాటు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. స్టాలిన్ ఆరోగ్యం ఎలా ఉందని ఓపీఎస్ అడిగారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నానని స్టాలిన్ తెలిపారు. ఆ తర్వాత గురువారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఓపీఎస్ ఆళ్వార్‌పేటలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఓపీఎస్ కలుసుకున్నారు. ఎన్డీయే నుండి వైదొలగినట్లు ప్రకటించిన కొద్ది సేపటికే ఆయన స్టాలిన్ నివాసగృహానికి వెళ్ళటంతో డీఎంకేతో పొత్తు పెట్టుకోవడానికే వెళ్ళారంటూ ప్రచారం జరిగింది. సుమారు అరగంటసేపు స్టాలిన్‌తో ఆయన సమావేశం కావటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం ఓపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోగ్యం గురించి వాకబు చేసేందుకే మర్యాదపూర్వకంగా కలుసుకున్నానని చెప్పారు. అదే సమయంలో రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు లేరన్నారు. జయలలిత హయాంలో 25 యేళ్లపాటు అన్నాడీఎంకేకు సేవలందించానని తెలిపారు. విజయ్ నాయకత్వంలోని టీవీకేతో పొత్తుపెట్టుకుంటారా? అని విలేఖరులు ప్రశ్నించినప్పుడు ఎన్నికల సమయంలో ఏవైనా జరుగవచ్చన్నారు. స్టాలిన్‌ను పరామర్శించేందుకే కలుసుకున్నానని, ఎన్నికల పొత్తులు గురించి ఆయన అడగలేదని, తానూ ప్రస్తావించలేదని, ఇరువురి భేటీ మర్యాదపూర్వకంగానే సాగిందన్నారు.

భక్తులను కటాక్షించే
దక్షిణ పండరీపుర
విఠలేశ్వరుడు

వివరాలు 7లో

ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు

- వీఐటీ సదస్సులో పారిశ్రామికవేత్త శక్తివేల్



ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంకర్



వాటర్ ట్యాంకర్ ఢీకొని ఇద్దరి మృతి



ట్యాంకర్ ఢీకొని ధ్వంసమైన స్కూటర్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి సమీపంలో గురువారం ఉదయం వాటర్ ట్యాంకర్ లారీ ఢీకొని మహిళ సహా ఇద్దరు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... ఆవడి నుంచి పూందమల్లికి గురువారం ఉదయం వెళ్తున్న చెన్నై మెట్రోవాటర్ బోర్డు కాంట్రాక్ట్ లారీ పూందమల్లి సమీపం సెన్నీర్‌కుప్పంలో అదుపు తప్పి కారు, ద్విచక్రవాహనం సహా పలు వాహనాలపై నుంచి వెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి ఆగింది.. ఆ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిళ సహా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఓ యువకుడు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను పూందమల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే, లారీ డ్రైవర్ మదురైకి చెందిన అళగురాజాను పట్టుకుని స్తంభానికి కట్టి చితకబాదారు. సమాచారం అందుకున్న ఆవడి ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసుల విచారణలో... మృతుడు మదురైకి చెందిన తాపీ మేస్త్రీ ధనపాల్ (25) అని, పనికి వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడని తేలింది.

లిఫ్ట్ కోరి వెళుతూ... : తిరువేర్కాడు సుందరచోళపురానికి చెందిన దేవి (40) మార్గమధ్యంలో కృష్ణన్ (55)ను లిఫ్ట్ కోరి అతని ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో లారీ ఢీకొని తీవ్రంగా గాయపడింది. చుట్టుపక్కల వారు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందింది.

మద్యం మత్తులో... : లారీ డ్రైవర్ అళగురాజా మద్యం మత్తులో ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన వెంటనే చుట్టుపక్కల వారు అళగురాజాను స్తంభానికి కట్టేశారు.. పోలీసులు అక్కడకు వెళ్లి అతడిని అరెస్ట్ చేశారు.అదే సమయంలో రెండు ట్యాంకర్ లారీలు పోటాపోటీగా అతివేగంగా వెళ్లడం కూడా ప్రమాదానికి కారణమని తెలిసింది. కాగా, పాఠశాలల సమయాల్లో ఇలాంటి లారీలకు అనుమతించడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, పాఠశాలల సమయాల్లో ఈ ప్రాంతంలో పోలీసులను నియమించి ట్రాఫిక్ పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కలిసి నడుద్దాం! మా కూటమిలోకి రండి

- విజయ్‌కి ఖుష్బూ ఆహ్వానం

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమితో కలిసి పోటీ చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూ 'తమిళ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్‌కి విజ్ఞప్తి చేశారు. విజయ్ తనకు చిన్న తమ్ముడు లాంటివాడని, డీఎంకేను ఓడించేందుకు తమ కూటమిలో చేరాలని సూచించారు. గురువారం ఆమె చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ఏర్పాటుకావడం సంతోషంగా ఉందన్నారు. విజయ్ ఇప్పుడే రాజకీయాల్లోకి వచ్చారని, వచ్చిన వెంటనే విజయాలు రావని, ఈ విషయం విజయ్ కూడా బాగా తెలుసని వ్యాఖ్యానించారు. సినిమాల్లో అగ్రస్థానంలో వున్నా... రాజకీయాల్లోకి వారు ఆశించిన విజయాలు దక్కవన్నారు. ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత కాలం వేరని, ప్రస్తుతం కాలం మారిందన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకేకు ఓడించాలని విజయ్ పిలుపునిచ్చారని, అదే నినాదంతో తామున్నామని తెలిపారు. డీఎంకేను గద్దె దింపాలని అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ఏర్పాటైందని, ఈ కూటమిలోకి విజయ్ రావాలని ఖుష్బూ పిలుపునిచ్చారు. అలాగే, బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయనున్నామన్నారు. ముఖ్యం గా, దక్షిణ చెన్నై పరిధిలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాలను నలుగురు ఉపాధ్యక్షులతో పర్యవేక్షిస్తున్నామని, ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ దేశాభివృద్ధికి చేస్తున్న కృషితో పాటు రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అందిస్తున్న చేయూత గురించి వివరించనున్నామని ఖుష్బూ తెలిపారు.

గ్రామాల్లో చిరువ్యాపారులకు

లైసెన్స్ అవసరం లేదు

- రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చిరువ్యాపారులకు లైసెన్స్ అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కార్పొరేషన్, మున్సిపాలిటీ ల్లోని వాణిజ్య దుకాణాలకు లైసెన్స్ ఉన్నట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు కూడా లైసెన్స్ పొందాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. టీ దుకాణాల నుంచి కల్యాణ మండపాల వరకు రూ.250 నుంచి రూ.50,000 వరకు ఫీజుగా చెల్లించి లైసెన్స్ పొందాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో, ఈ విషయమై అధ్యయనం చేసేందుకు ఒక కమిటీ వేస్తామని మంత్రి పెరియస్వామి తెలిపారు. అలాగే, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపార సంఘాలు కూడా వినతి పత్రం సమర్పించాయి. ఈ క్రమంలో, గ్రామాల్లో చిరు వ్యాపారాలకు లైసెన్స్ అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఆగని లంక నావికాదళ దాడులు

- 9 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరానికి ఆరు నాటికల్ మైళ్ల దూరంలో చేపలు పడుతున్న తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులకు పాల్పడింది. తమ దేశ సముద్ర సరిహద్దుల్లో అక్రమంగా ప్రవేశించారంటూ 9 మంది జాలర్లను అరెస్టు చేశారు. జాలర్లకు చెందిన పడవను, అందులో మత్స్య సంపదను, జీపీఎస్ తదితర పరికరాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రామేశ్వరం నుండి తొమ్మిదిమంది జాలర్ల నాటుపడవలో చేపలవేటకు వెళ్ళారు. గురువారం వేకువజాము గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం చుట్టుముట్టి జాలర్లను అరెస్టు చేసి శ్రీలంకకు తరలించుకెళ్ళారు. ఈ విషయమై రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు రాష్ట్ర మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల రెండు వేర్వేరు సంఘటనల్లో శ్రీలంక నావికాదళం 14 మంది తమిళ జాలర్లను అరెస్టు చేసింది. దీంతో జాలర్ల కుటుంబ సభులుఉ, జాలర్ల సంఘం నాయకుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో 9 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేయడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. జాలర్లను విడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

సమాచార దర్శిని

రామేశ్వరం-తలైమన్నార్ మధ్య నౌకాయానం

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం-శ్రీలంక తలైమన్నార్ మధ్య ప్రయాణికుల నౌకా సేవలు ప్రారంభించనున్నట్లు మంత్రి ఏవీ వేలు తెలిపారు. రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ సమీపంలో పోర్ట్ అండ్ మారిటైమ్ బోర్డుకు చెందిన పాత హార్బర్ భవనాన్ని తొలగించి, రూ.4.19 కోట్ల తో కొత్త భవనం నిర్మించారు. ఈ భవనాన్ని శుక్రవారం ప్రారంభించిన మంత్రి ఏవీ వేలు మాట్లాడుతూ... రామేశ్వరం-తలైమన్నార్ మధ్య ప్రయాణికుల నౌకలను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, అనుమతి లభించిన వెంటనే 'సాగర్‌మాల' పథకంలో రామేశ్వరం-తలైమన్నార్ మధ్య నౌకాయానం ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.

4న 'విన్‌పాస్ట్' కర్మాగారం ప్రారంభించనున్న సీఎం

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాల తయారీ కర్మాగారాన్ని ఈ నెల 4వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. వియత్నాంకు చెందిన 'విన్‌పాస్ట్' కార్ల తయారీ సంస్థ, తూత్తుకుడిలో విద్యుత్ వాహనాల కర్మాగారం ప్రారంభించనుంది. ఈ కర్మాగారానికి గతంలో సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 3న చెన్నై నుంచి విమానంలో తూత్తుకుడి వెళ్లనున్న సీఎం, 4వ తేది కార్ల కర్మాగారం ప్రారంభించనున్నారు. ఈ కర్మాగారం ఏర్పాటుతో తూత్తుకుడి, పరిసర జిల్లాలకు చెందిన ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికి ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

గ్రూప్-2, 2ఏ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) నిర్వహిస్తున్న గ్రూప్-2,2ఏ పరీక్షలకు శుక్రవారం నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం కానుంది. ఈ మేరకు చెన్నై జిల్లా యంత్రాంగం విడుదల చేసిన ప్రకటనలో... గిండిలోని ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు తరగతులు నిర్వహించనున్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నవారు, దరఖాస్తు నకలతో గిండీలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి తరగతుల్లో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు decgc.coaching-class@gmail.com అనే ఈ-మెయిల్ ద్వారా తెలుసుకోవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం తెలిపింది.

యోగా, ప్రకృతి వైద్యకోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యోగ, ప్రకృతి వైద్యకోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు గడువు పొడిగించారు. ఈ మేరకు భారత వైద్య, హోమియోపతి బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... 2025-26 విద్యా సంవత్సరం ప్రభుత్వ కోటా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు బీఎన్‌వైఎస్ (యోగా మరియు ప్రకృతి వైద్య) కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు www.tnhealth.tn.gov.in, ww w.tnayushselection.org అనే వెబ్‌సైట్లలో ఈ నెల 8వ తేది సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలి. ప్రభుత్వ కోటా సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తగిన సర్టిఫికెట్లు, స్వీయ వివరాలతో నకళ్లను అరుంబాక్కంలోని భారత వైద్య, హోమియోపతి కమిషనర్ కార్యాలయానికి పోస్టు, కొరియర్ ద్వారా పంపించాలని బోర్డు తెలియజేసింది.

విలేజ్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2,300 గ్రామ సహాయకులు (విలేజ్ అసిస్టెంట్) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కనీస విద్యార్హత పదవ తరగతి కాగా, తమిళం ఒక పాఠ్యాంశంగా చదివి ఉండాలి. టెన్త్ ఉత్తీర్ణులు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఖాళీ పోస్టు ఉన్న గ్రామం, తాలూకాకు చెందిన వారై ఉండాలి. జనరల్ విభాగంలో 21 నుంచి 32 ఏళ్లలోపు వారై ఉండాలి. బీసీ, ఎంబీసీ, ఎస్సీ, ఎస్సీఏ, ఎస్టీ విభాగాలకు 37 ఏళ్ల వరకు అనుమతించారు. ఇంటర్వ్యూ ద్వారా పోస్టులు భరీచేయనుండగా, వేతనం నెలకు రూ.11,100-రూ.35,100గా నిర్ణయించారు. అర్హులైన వారు ఈ నెల 5వ తేదిలోపు www.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు గ్రామ పంచాయతి, తహసీల్దార్ కార్యాలయాలను నేరుగా సంప్రదించవచ్చని గ్రామీణ అభివృద్ధి శాఖ తెలియజేసింది.

హజ్ యాత్రకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 2026 హజ్ యాత్రకు వెళ్లేందుకు, దరఖాస్తు గడువు పొడిగించారు. 2026 హజ్ యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి కలిగిన వారు జూలై 30వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని తొలుత ప్రకటించారు. ప్రస్తుతం మరో వారం రోజులు గడువు పొడిగించారు. ఆ ప్రకారం, ఈ నెల 7వ తేది వరకు దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని భారత హజ్ అసోసియేషన్ ప్రకటన విడుదల చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 4 లక్షలకు దాటిన అడ్మిషన్లు

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం 4 లక్షల మంది పైగా విద్యార్థులు చేరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తన ఎక్స్‌లో వివరాలు వెల్లడించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 37 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 50 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి మార్చి 1వ తేది నుంచి అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు కేవీ తరగతుల్లో 32,807 మంది, 1వ తరగతి తమిళ మాధ్యమంలో 2,11,563, ఆంగ్లం మాధ్యమంలో 63,896 మంది, 2 నుంచి 8వ తరగతి వరకు 92,098 మంది విద్యార్థినీ, విద్యార్థులు మొత్తం 4,00,364 మంది చేరారని, 'ప్రభుత పాఠశాల పేదరికానికి సంకేతం కాదు! అది గర్వానికి సంకేతం'అంటూ మంత్రి అన్బిల్ మహేష్ పోస్ట్ చేశారు.

రూ.1,500 కోట్లతో 133 సబ్ స్టేషన్లు

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రూ.1,500 కోట్ల వ్యయంతో 133 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్ బోర్డు టెండర్లను ఆహ్వానించింది. విద్యుత్ కోతలు లేని రాష్ట్రంగా తమిళనాడును తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో, అధిక విద్యుత్ వినియోగం జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లో కొత్తగా సబ్‌స్టేషన్లు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, కేంద్ర ప్రభుత్వం పునర్నిర్మాణ విద్యుత్ పంపిణీ పథకం కింద రూ.1,500 కోట్లతో 133 సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించింది. టెండర్ల ప్రక్రియ ఈ నెల 10వ తేదీతో ముగించి సంస్థను ఎంపిక చేసి పనులు ప్రారంభించాలని విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది.

పుస్తక పఠనంపై అవగాహన

● బడిపిల్లలతో పాల్గొన్న కలెక్టర్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినంలో గురువారం ఉదయం 'నాగై వాసిక్కరదు' (నాగపట్టినం పఠిస్తోంది) పేరుతో పుస్తకపఠనంపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ఆ జిల్లా కలెక్టర్ ఆకాష్ ప్రారంభించారు. ఆ సందర్భంగా పలు పాఠశాలలకు వెళ్ళి పుస్తకపఠం ప్రాధాన్యత వివరించారు. ఆ తర్వాత ఐఐటీ క్యాంపస్ వద్ద ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గంటసేపు విద్యార్థులు, ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది కలిసి పుస్తకపఠనం చేశారు. ఆ సందర్భంగా ఓ పాఠశాలకు వెళ్ళి పుస్తకపఠనం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆకాష్ పాల్గొన్నారు. ఓ బాలిక పుస్తకపఠనం చేస్తుండగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ కూర్చుని పుస్తకపఠనం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. నంబియార్ నగర మునిసిపాలిటీ స్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుభాషిని, జిల్లా విద్యాధికారులు దురై మురుగన్, మణి, విమలా, కన్నన్, ప్రధానోపాధ్యాయురాలు ఉలగాంబిక్కై తదితరులు పాల్గొన్నారు.


పుస్తకపఠం ప్రాధాన్యతపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి బడి పిల్లలతో పాటు పుస్తకపఠనం చేస్తున్న కలెక్టర్ ఆకాష్

డీజీపీ ఎంపిక సత్వరం చేపట్టాలని కోరుతూ పిటిషన్

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ పదవీకాలం ఆగస్టు 31వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, కొత్త డీజీపీ ఎంపిక సత్వరం చేపట్టాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. డీజీపీ పదవీవిరమణ అనంతరం పదవీకాలం పొడిగించడం, ఇన్‌ఛార్జి డీజీపీ నియామకం తదితరాలు చేపట్టరాదని కోరుతూ రామనాథపురానికి చెందిన న్యాయవాది యాసర్ అరాఫత్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుందని పిటిషనర్ తెలిపారు.

3న శ్రీరామ్స్ ఎంటర్‌టైనర్స్ సినీ సంగీత విభావరి

ప్యారీస్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సినీ రంగంలో ఐదు దశాబ్దాలుగా గాయకుడిగా, ప్రోగ్రామ్ ఆర్గనైజర్‌గా రాణిస్తున్న శ్రీరామ్స్ ఎంటర్‌టైనర్స్ నిర్వాహకుడు బి.శ్రీరాములును సినీ ప్రముఖులు సత్కరించనున్నారు. టి.నగర్‌లోని వాణి మహల్‌లో ఈ నెల 3వ తేదీ ఆదివారం సాయంత్రం 6.05 గంటలకు ప్రారంభంకానున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ నేపథ్య గాయని పి.సుశీల, గాయకులు ఎస్పీ చరణ్, ఎస్పీ శైలజ, మనో, రాము, యుగేంద్రన్, సంజన, హరిప్రియ, డ్రమ్మర్ శివమణి, గీతాంజలి ఇన్నిసైరా ధంగల్ నేతృత్వంలో సినీ సంగీత విభావరి జరగనుంది.

నేడు ఎస్‌కేపీసీలో నేత్ర వైద్యశిబిరం

ప్యారీస్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)ప్రాంగణంలో శుక్రవారం మెగా నేత్రవైద్య శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు జరగనుంది. ఎస్‌కేపీసీ ఆడిటోరియంలో ఐక్యూఏసీ, వైఆర్‌సీ, వైఐ, ఎన్ఎస్ఎస్, రాజన్ ఐకేర్ ఆస్పత్రి సంయుక్తంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం 9.15 గంటలకు ఆడిశుక్రవార అన్నకూట మహోత్సవం జరగనుంది. వాసవాంబకు క్షీరాభిషేకం, అలంకారం, దీపారాధన, అన్నకూట మహోత్సవం, ప్రసాద వినియోగం, భక్తి సంగీత కార్యక్రమం జరగనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా నగరవాసులకు ఎస్‌కేపీసీ చారిటీస్ ట్రస్టీలు పిలుపునిచ్చారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమంగా తీసుకొచ్చి నగరంలో విక్రయించిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అన్నానగర్ పోలీసులకు అందిన సమాచారం మేరకు, బుధవారం పెరంబూర్ రైల్వేస్టేషన్ సమీపంలో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు కేరళ రాష్ట్రం వయనాడుకు చెందిన రోహిత్ జోసఫ్, ఆషిక్ అని తెలిసింది. అలాగే, సాలిగ్రామం కుళిల్‌దాస్ వీధిలో ఎక్సైజ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి, అదే ప్రాంతానికి చెందిన యాసర్ రఫీక్ నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు నిర్వహించే ప్రాంతాల వివరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, తిరువొత్తియూర్ మండలం 5వ వార్డులోని సౌందర పాండి నగర్‌లోని వీకే మహల్, రాయపురం మండలం 55వ వార్డు పరిధిలోని సెవెన్ వెల్స్ సెయింట్ జేవియర్ వీధిలోని కమ్యూనిటీ హాలు, అన్నా నగర్ మండలం 98వ వార్డు కీల్పాక్కం ఆస్పిరన్ గార్డెన్ మొదటి వీధిలోని 98వ వార్డు కార్యాలయం, కోడంబాక్కం మండలం 127వ వార్డులోని కోయంబేడు కాళియమ్మన్ ఆలయం వీధి సమీపంలో ఉన్న చెన్నై మెట్రోకవాటర్ బోర్డు ప్రాంగణంలోని బ్యాటరీ వాహనాలు నిలిపే ప్రాంతం, ఆలందూర్ మండలం 157వ వార్డు ఆర్కాడు రోరడ్డులోని శాస్త్రోరగం అరంగం, అడయార్ మండలం 173వ వార్డు కస్తూరిభాయ్ నగర్‌లోని కమ్యూనిటీ హాలులో శిబిరాలు జరుగనున్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటలవరకుజరిగే శిబిరాల్లో ప్రజలు పాల్గొని వినతిపత్రాలు సమర్పించవచ్చని జీసీసీ తెలిపింది.

బైక్ కొనివ్వలేదంటూ విద్యార్థి ఆత్మహత్య

వేలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బైక్ కొనివ్వలేదని కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. స్థానిక వెలప్పాడికి చెందిన జయగోపి కొద్ది సంవత్సరాల క్రితం మృతి చెందగా, అతని కుమారుడు అరిదాస్ (18) ఒట్టేరిలోని ముత్తురంగం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆరిదాస్ తల్లి ఓ ఫుడ్ షాపులో పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో, అరిదాస్ తనకు బైక్ కొనివ్వాలని తల్లి కోరగా, ప్రస్తుతం డబ్బు లేదని, కొద్ది రోజుల తర్వాత కొనిస్తానని చెప్పినట్లు సమాచారం. దీంతో, మనస్తాపం చెందిన అరిదాస్ బుధవారం కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయాడు.సాయంత్రం బయటకు వెళ్లి మద్యం సేవించి వచ్చిన అరిదాస్, తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఎంతసేపటికీ అతను బయటకు రాకపోవడంతో తల్లి గది దగ్గరకు వెళ్లి కిటికీలో నుంచి చూడగా ఫ్యాను ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కుమారుడిని చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అటవీ కార్యాలయంలో విచారణ ఖైదీ ఆత్మహత్య


అటవీశాఖ కార్యాలయం వద్ద పోలీసులు - ఇన్‌సెట్‌లో మారిముత్తు (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉడుమలై అటవీ శాఖ కార్యాలయంలో విచారణ ఖైదీ ఆత్మహత్య చేసుకున్నాడు. పులి దంతాలతో సంచరిస్తున్నాడనే ఆరోపణతో అటవీ శాఖ అధికారులు నిర్బంధించి అతడిని విచారణ జరిపారు. ఆ నేపథ్యంలో అటవీ శాఖ కార్యాలయం టాయ్‌లెట్‌లో ఆ ఖైదీ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉడుమలై సమీపం పడమటి కనుమల ప్రాంతం వద్ద మేల్ గురుమలై సెంటిల్‌మెంట్ ఏరియాకు చెందిన మారిముత్తు(45) కేరళ, రాష్ట్ర సరిహద్దుల ప్రాంతంలో పులిదంతాలను తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు.ఆ తర్వాత ఉడుమలై అటవీ కార్యాలయానికి తీసుకెళ్ళి విచారణ జరిపారు. విచారణ పూర్తయిన తర్వాత మారిముత్తు మూత్రవిసర్జన కోసం మరుగుదొడ్డికి వెళ్ళి చాలా సేపటివరకు బయటకు రాలేదు.దీంతో అటవీ సిబ్బంది మరుగుదొడ్డి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్ళి చూడగా మారిముత్తు ఉరివేసుకుని కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే అటవీ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న గురుమలై ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు అటవీ శాఖ అధికారులు చిత్రహింసలు పెట్టి మారిముత్తును హత్యచేసి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఉడుమలై డీఎస్పీ నమశ్శివాయం సంఘటన స్థలంలో విచారణ జరిపారు.

కుమార్ సేవలు చిరస్మరణీయం

● ఆదరణ కూడికలో వక్తలు


కన్నిమరకల కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుల్లాపురం వాసులు, కుటుంబసభ్యులు

ప్యారీస్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్ సమీపంలోని పుల్లాపురం ఆదిఆంధ్ర సేవా సంఘం కార్యదర్శి, నేషనల్ సఫాయ్ కర్మచారి మాజీ సభ్యుడు దివంగత కన్నిమరకల కుమార్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ నెల 21వ తేదీ గుండెపోటుతో మృతిచెందిన కుమార్ ఏఐఎస్ఎంసీ తమిళనాడు అధ్యక్షుడు, టీఎస్ఎస్ఎంసీ, ఎన్ఎస్‌సీఎల్ఆర్ఎస్సీఎస్‌కే మాజీ సభ్యుడిగా వ్యవహరించారు. ఢిల్లీలో జరిగిన జాతీయ సమావేశాల్లో పాల్గొని పారిశుధ్య కార్మికుల తరుపున ఉద్యమాలు సాగించారు. అదేవిధంగా పుల్లాపురం గ్రామాభివృద్ధికి ఆదిఆంధ్ర సేవా సంఘం కార్యదర్శిగా తనవంతు కృషిచేశారు. గురువారం ఉదయం జరిగిన ఆదరణ కూడికలో కుమార్ చిత్రపటాన్ని క్రైస్ట్ గాస్పల్ అసెంబ్లీ పాస్టర్ పీజే రూబన్ ఆవిష్కరించి నివాళులర్పించారు. కుమార్ సతీమణి కాంతమ్మ, కుటుంబ సభ్యులు బి.భార్గవి-జోషువా, కె.దిలీప్‌కుమార్-నందిని, పుల్లాపురం ఆదిఆంధ్ర సేవాసంఘం అధ్యక్షులు ఇరకట్ల నాగభూషణం, ట్రెజరర్ ఎస్ఏ శ్రీనివాసన్, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి సహా పలు తెలుగు సంఘాల నాయకులు పాల్గొని కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆడి కృత్తిక సందర్భంగా జోరుగా కావళ్ల విక్రయాలు



తిరుత్తణి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు ఆడి కృత్తిక ఉత్సవాలకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి క్షేత్రం ఆడికృత్తిక ఉత్సవాల్లోనే ప్రత్యేకత సంతరించుకుంది. లక్షలాది మంది భక్తులు కావళ్లతో ఆలయానికి వస్తారు. ఇందుకోసం తిరుత్తణి నగర వ్యాప్తంగా కావళ్లు తయారుచేసే విక్రయదుకాణాలు వెలుస్తున్నాయి. ఆడి కృత్తికకు కేవలం 15 రోజులు మాత్రమే ఉండటంతో పాల కావడి, పన్నీర్ కావడి, నెమలికావడి, పుష్ప కావడి, శూలకావడి తదితర కావళ్ల తయారుచేసే పనుల్లో నిమగ్నమయ్యారు. రూ.500 నుంచి రూ.10వేల వరకు కావళ్లు అందుబాటులో ఉన్నట్లు విక్రయదారులు చెబుతున్నారు.

కవిన్ తల్లిదండ్రులకు ఎంపి కనిమొళి పరామర్శ



చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో గత ఆదివారం పరువుహత్యకు గురైన చెన్నై ఐటీ ఉద్యోగి కవిన్ తల్లిదండ్రులను డీఎంకే ఎంపీ కనిమొళి, మంత్రులు కేఎన్ నెహ్రూ, అనితా రాధాకృష్ణన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ గురువారం ఉదయం పరామర్శించారు. తూత్తుకుడి జిల్లా ఆరుముగమంగళం ప్రాంతానికి చెందిన కవిన్ సెల్వగణేష్ (27) చెన్నైలోని సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తుండేవాడు. అగ్రకులానికి చెందిన తన చిన్ననాటి స్నేహితురాలిని ప్రేమించాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి సోదరుడు సుర్జిత్ కేటీసీ నగర్‌లో కవిన్ దారుణంగా హతమార్చాడు. ఈ నేపథ్యంలో ఎస్ఐలుగా పని చేస్తున్న సుర్జిత్ తల్లిదండ్రులు శరవణన్, కృష్ణకుమారిలను అధికారులు సస్పెండ్ చేశారు. గురువారం ఈ కేసులో ఎస్ఐ శరవణన్ పోలీసులు అరెస్టు చేశారు. అదే సమయంలో ఆ యువతి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసింది. కవిన్‌ను తాను ప్రేమించిన మాట వాస్తవమేనని, అయితే ఈ విషయం తన తల్లిదండ్రులకు ఏ మాత్రం తెలియదన్నారు. తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు తెలియదని ఆ యువతి చెప్పడం వారిని కేసు నుండి కాపాడటానికేనని, తన కుమారుడిని పథకం వేసి హత్య చేసారని కవిన్ తండ్రి చంద్రశేఖర్ ఆరోపించారు.

18 నుంచి చెన్నై బీచ్ నుంచి చార్మినార్ ఎక్స్‌ప్రెస్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లో పునరుద్ధరణ పనుల కారణంగా చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 18 నుంచి చెన్నై బీచ్ నుంచి నడుపనున్నారు. ఆ ప్రకారం, తాంబరం వెళ్లాల్సిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18 నుంచి డిసెంబరు 31వ తేది వరకు చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది. నెం.12759 చెన్నై బీచ్-హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ చెన్నై బీచ్ నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరుతుంది. అలాగే, నెం.12760 హైదరాబాద్-చెన్నై బీచ్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.15 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.


కొరట్టూరు భక్తవత్సలం మెమోరియల్ స్కూలులో వర్షాకాలంలో సంభవించే ప్రమాదాల నుండి బయట పడే విధానాలపై ప్రదర్శన నిర్వహిస్తున్న అంబత్తూరు అగ్నిమాపక దళం

ర్యాంగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల సస్పెన్షన్

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కూడలూరు ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినిపై ర్యాగింగ్ చేసిన వ్యవహారంలో ఆరుగురు విద్యార్థులపై సస్పెన్షన్ వేటుపడింది. కూడలూరు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థిని గత 24న కొందరు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదుపై కళాశాల యాజమాన్యం విచారణ చేపట్టింది. అందులో... ర్యాగింగ్ జరిగినట్టు నిర్ధారణ కావడంతో, మూడవ సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులను కళాశాల యాజమాన్యం శుక్రవారం సస్పెండ్ చేసింది.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

● పోక్సో చట్టం కింద టీచర్ అరెస్ట్

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడు కటకటాలపాలయ్యాడు. తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రంజిత్ కుమార్ ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రంజిత్ కుమార్ తరగతి గదిలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, కొద్దిరోజుల క్రితం పాఠశాలలో మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమలంలో పాల్గొన్న అధికారులు, లైంగిక వేధింపుల ఘటనలు ఎదురైతే '1098' అనే నెంబరు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో విద్యార్థినులు 1098 నెంబరుకు ఫోన్ చేసి ఆంగ్ల ఉపాధ్యాయుడు రంజిత్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. అధికారులు పాఠశాలకు చేరుకుని విద్యార్థినులను విచారించి, వారి ఫిర్యాదు వాస్తవమని గుర్తించి, ఉపాధ్యాయుడిపై ఆండిపట్టి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, రంజిత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

ఐదుకు పెరిగిన బాణసంచా మృతుల సంఖ్య

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విరుదు నగర్ జిల్లాలో జరిగిన బాణసంచా ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. వడకరైలో రాజా చంద్రశేఖర్‌కు చెందిన బాణసంచా కర్మాగారంలో కొద్దిరోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో కరుప్పయ్య, సౌండమ్మాళ్, గణేశన్, పేచ్చియమ్మాళ్‌కు మృతి చెందారు. ఈ క్రమంలో, ఈ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మురుగన్ గురువారం మృతిచెందాడు. దీంతో, బాణసంచా ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు పెరిగిందని పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి ఏనుగు మృతి


ఏనుగు కళేబరాన్ని వెలికితీస్తున్న దృశ్యం

పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి ఏనుగు మృతిచెందిన ఘటన కోయంబత్తూర్ జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలో పశ్చిమ కనుమల్లో కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, ఆ ప్రాంతంలోని ఏనుగులు సమీపంలోని వ్యవసాయ భూములకు ఆహారం, తాగునీటి కోసం వస్తున్నాయి. ఈ క్రమంలో, నల్లార్ వయల్‌సొగై ప్రాంతంలో ఉన్న వ్యవసాయ భూముల్లో బుధవారం ఏనుగులు మకాం వేయడాన్ని గమనించిన స్థానికులు అటవీ శాఖకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని బాణాసంచా కాల్చుతూ, డప్పుల మోగిస్తే ఏనుగుల మందను అడవుల్లోకి తరిమేందుకు యత్నించారు. ఆ సమయంలో, మంద నుంచి విడిపోయిన 45 ఏళ్ల మగ ఏనుగు గురువారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో ఆ ప్రాంతంలో 20 అడుగుల లోతున్న వ్యవసాయ బావిలో పడింది. బావిలో నీరు అధికంగా ఉండడంతో ఏనుగు మృతిచెందింది. దీంతో, అటవీ సిబ్బంది ఎక్స్‌కవేటర్ ద్వారా ఏనుగు కళేబరాన్ని బావి నుంచి వెలికితీసి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

తిరుప్పూరు స్కూలులో బాలికపై లైంగిక వేధింపులు

● అస్సోమ్ యువకుడి అరెస్టు


విద్యార్థులకు భద్రత కల్పించాలని కోరుతూ ధర్నా చేస్తున్న స్థానికులు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు కేవీఆర్ నగర్ ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాల టాయ్‌లెట్‌లో ఆరేళ్లబాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డిన జెయ్ (27) అనే అస్సోం యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. టాయ్‌లెట్‌ను శుభ్రం చేస్తున్న జెయ్ ఆ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, ఈ విషయం గురించి పాఠశాల నిర్వాహకులకు తెలిపినా పట్టించుకోలేదని ఆమె కుటుంబీకులు ఆరోపించారు. చివరకు బాలిక తమకు సంగతి తెలిపిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. పోలీసులు విచారణ జరిపి అస్సోమ్ యువకుడిని అరెస్టు చేసి మహిళా పోలీసులకు అప్పగించారు. ఆ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం ఆ పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కలిసి ధర్నా జరిపారు. పాఠశాలలో చదువుతున్న బాలికలకు భద్రత కల్పించాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు.

విద్యుదాఘాతానికి గురైన నెమలి

● ఏడు నిమిషాల్లో అటవీ శాఖకు అప్పగింత



పెరంబూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురైన నెమలిని అటవీ శాఖ అధికారులకు అప్పగించిన అంబులెన్స్ డ్రైవర్‌ను ప్రజలు, అధికారులు అభినందించారు. కోయంబత్తూర్ సింగానల్లూర్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం విద్యుత్ స్తంభంపై వాలిన నెమలి విద్యుత్ షాకు గురై కింద పడింది. గుర్తించిన స్థానికులు '108' అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈ ప్రాంతానికి చేరుకున్న అంబులెన్స్ డ్రైవర్ ప్రబంధ్, గాయపడిన నెమలికి అంబులెన్స్‌లో ఏడు నిమిషాల్లో అటవీ శాఖ కార్యాలయానికి చేర్చాడు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... నెమలి గుండె సమీపంలో చిన్న గాయం ఏర్పడిందని, ప్రస్తుతం చికిత్స అందిస్తున్నామని తెలిపారు. కాగా, నెమలిని సకాలంలో చేర్చిన డ్రైవర్‌ను అటవీ శాఖ అధికారులు, ప్రజలు అభినందించారు.

'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమాలకు విశేష స్పందన

● ఎమ్మెల్యే ఎస్.చంద్రన్


ప్రజలకు రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే

తిరుత్తణి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో గురువారం నిర్వహించిన 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమంలో ప్రజలు అధికారులకు వినపత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ మాట్లాడుతూ, జూలై 15న చిదంబరంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 'ఉంగళుడన్ స్టాలిన్' అనే పథకాన్ని ప్రారంభించారని, తిరుత్తణిలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సహా, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'కూలీ' కథాంశం ఇదేనా?



రజనీకాంత్ - లోకేష్ కనకరాజ్

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ - సూపర్‌స్టార్ రజనీకాంత్ కాంబోలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న 'కూలీ' చిత్ర కథ ఏంటన్నదానిపై కోలీవుడ్‌లో గత కొన్ని నెలలుగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇపుడు ఆ చిత్ర కథాంశం లీకైంది. దీనికి కారణం లేకపోలేదు. ఈ సినిమా ఈ నెల 14న విడుదలకానుంది. ఈ రిలీజ్‌కు రెండు వారాల ముందు విదేశీ సెన్సార్‌షిప్ కోసం తాజాగా దరఖాస్తు చేసింది. అందులోని సమాచారం మేరకు... 'కార్మిక సంఘాలు, రహస్యంగాసాగే అక్రమ రవాణా ముఠాల నేపథ్యం, రోజువారీ కూలీలను అత్యంత కిరాతకంగా వేధించే ముఠాకు వ్యతిరేకంగా పోరాడే ధైర్యవంతుడైన కార్మికుడి పోరాటమే ఈ సినిమా మూల కథాంశం. శక్తి, దృఢ సంకల్పంతో తనదైనశైలిలో పోరాటం చేయడంతో పాటు కార్మిక వర్గం గౌరవాన్ని కాపాడే సాటి కార్మికుడిగా రజనీకాంత్ పాత్ర కొనసాగుతుంది. ఇందులో పాతకాలపు రజనీ స్టైల్, లోకేష్ కనకరాజ్ శక్తివంతమైన కథనం, స్టైలిష్ యాక్షన్ సన్నివేశాలతో ఫుల్ యాక్షన్ మాస్ మూవీగా రూపొందించారు. కాగా, ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్, సత్యరాజ్, శృతి హాసన్ వంటి పలువురు అగ్ర నటీనటులు నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

కోలీవుడ్‌లోకి మరో మలయాళ భామ

చిత్రజ్యోతి

తమిళ చిత్రపరిశ్రమలోకి మరో మలయాళ బ్యూటీ అర్ష బైజు అడుగుపెట్టారు. దర్షన్ హీరోగా నటించిన 'హౌస్‌మేట్స్' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటించారు. 'ఫ్యామిలీ' అనే మలయాళ చిత్రం ద్వారా వెండితెర అరంగేట్రం చేసిన అర్ష బైజు... ఆలపుళ సమీపంలోని మున్నార్‌లో జన్మించారు. మాలీవుడ్‌లో అనేక చిత్రాల్లో నటించి తనకంటూ గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఇపుడు హౌస్‌మేట్స్ ద్వారా తమిళంలో అడుగుపెడుతున్నారు. తన కోలీవుడ్ ఎంట్రీపై ఆమె మాట్లాడుతూ, 'తమిళంలో ఇది నాకు తొలి చిత్రం. నాపై నమ్మకముంచి ఒక మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజవేల్‌కు ధన్యవాదాలు. మంచి చిత్ర బృందంతో కలిసి పనిచేసినందుకు చాలా ఆనందంగా ఉంది. దర్షన్ ది బెస్ట్ కో యాక్టర్. శ్రమజీవి. నా తొలి చిత్రంలోనే కాళివెంకట్, వినోదిని వంటి సీనియర్ నటీనటులతో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.



అర్ష బైజు

సామాజిక సందేశాత్మక చిత్రంగా 'భోగి'

డైరెక్టర్ విజయశేఖరన్ దర్శకత్వంలో కొత్త నటీనటులతో తెరకెక్కించిన 'భోగి' సందేశాత్మక చిత్రంగా రూపొందించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్‌ను 10 లక్షల మంది నెటిజన్లు వీక్షించారు. సమాజాన్నే ఉలిక్కిపడేలా చేసిన రెండు యదార్థ సంఘటనల ఆధారంగా ఆసక్తికరమైన క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో, సందేశాత్మక చిత్రంగా తెరకెక్కించారు. ఇందులో శరత్, నబి నంది, 'లబ్బర్ పందు' శ్వాసిక, పూనమ్ కౌర్, వేల రామ్మూర్తి, స్నేహన్, సంగిలి మురుగన్, మొట్టై రాజేంద్రన్, ఎంఎస్ భాస్కర్ వంటి తారాగణం నటించారు. శుక్రవారం విడుదలవుతున్న ఈ చిత్రాన్ని వీఐ సినిమా గ్లోబల్ నెట్‌వర్క్ అండ్ లైక్ బ్యానరుపై నిర్మించగా, పీజీపీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పీజీ పిచ్చైమణి రిలీజ్ చేస్తున్నారు.

'భోగి'లో ఓ దృశ్యం



'ఇంద్ర'గా వసంత్ రవి

'ఇంద్ర' ఫస్ట్‌లుక్



వసంత్ రవి హీరోగా 'ఇంద్ర' పేరుతో రూపొందుతున్న సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. దర్శకుడు రామ్ 'తరమణి' చిత్రంలో వెండి తెరకు పరిచయమైన వసంత్ రవి 'రాకీ', 'జైలర్' వంటి హిట్ చిత్రాల్లో నటించి మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఆయన చివరగా సత్యరాజ్‌తో కలిసి 'వెపన్' మూవీలో నటించారు. ఇపుడు జేఎస్ఎం, ఎంపరర్ ఎంటర్‌టైన్మెంట్ సమర్పణలో 'ఇంద్ర' మూవీ తెరకెక్కింది. డెబ్యూ డైరెక్టర్ శబరీష్ నందా దర్శకత్వం వహించారు. టాలీవుడ్ నటుడు సునీల్ ఓ ముఖ్య పాత్ర పోషించారు. మెహ్రీన్ ఫిర్జాదా హీరోయిన్ కాగా, అజ్మల్ దక్షిణ్ సంగీతం సమకూర్చిన ఈ సినిమా నుంచి తొలి పాటను తాజాగా రిలీజ్ చేశారు. ఈ నెల 22న థియేటర్లలో విడుదల చేయనున్నారు.

ఆధ్యాత్మికం

భక్తులను కటాక్షించే పాండురంగడు

● దక్షిణ పండరీపుర విఠలేశ్వరుడు



రుక్మిణీ, సత్యభామా సమేత విఠలేశ్వడు

భక్తుల కోర్కెలను నెరవేర్చే కల్పవృక్షం తూత్తుకుడి జిల్లా విఠలాపురంలో వెలసిన పాండురంగ విఠలేశ్వరుడు. ఉత్తరాదిలోని పండరీపురం వంటిదే ఈ దివ్యక్షేత్రం. భక్తులంతా ఈ ప్రాంతాన్ని 'తెన్ పండరీపురం' (దక్షిణ పండరీపురం) అని పిలుస్తున్నారు. ఈ ఆలయంలో స్వామిని దర్శిస్తే పండరీపుర వాసుడిని దర్శించినంత భాగ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అర్చామూర్తి విఠలేశ్వరుడి దర్శనం ముక్తి దాయకం.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

స్థలపురాణం... విజయనగర సామ్రాజ్యంలో విఠలరాయుడనే చక్రవర్తి 'మురబ్బ' ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని పాలిస్తుండేవారు. పండరీపురంలోని పాండురంగ విఠలుడిపట్ల అపారమైన భక్తి ఉండేది. పాండురంగడికి తామ్రభరణి నదీతీరాన ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. తన కోరిక నెరవేరేందుకు పాండురంగడి కరుణ కోసం తపస్సు చేశారు. అతడి తపస్సును మెచ్చి స్వామివారు ప్రత్యక్షమై 'రాజా తామ్రభరణి నదీతీరంలో ఓ చోట నిమ్మపండు తేలుతుంది. తామ్రభరణి నదిలో నీరు సుడిగుండంలా తిరిగే ప్రాంతంలో ఆ నిమ్మపండు స్థిరంగా నిలుస్తుంది. అక్కడ తవ్విస్తే నా విగ్రహం లభిస్తుంది, ఆ సమయంలో గరుత్మంతుడు వచ్చి ఆలయాన్ని నిర్మించే ప్రాంతాన్ని సూచిస్తాడు. అక్కడే నా విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆరాధించు' అని చెప్పి అంతర్థానమయ్యారు. వెంటనే విఠలరాయుడు తన సైన్యాన్ని వెంటబెట్టుకుని తామ్రభరణి నదీతీరానికి చేరుకున్నాడు. పాండురంగడు చెప్పినట్లే ఓ దగ్గర నీటిపై నిమ్మపండు తేలుతూ కదిలింది. ఆ నిమ్మపండును అందరూ అనుసరించారు. చివరకు ఆ నిమ్మపండు 'ముత్తాలంకురిచ్చి' అనే చోట స్థిరంగా నిలిచింది. విఠలరాయుడి ఆజ్ఞ ప్రకారం సైనికులు అక్కడ తవ్వగా అందమైన పాండురంగడి విగ్రహం లభించింది. అదే సమయంలో గరుడాళ్వార్ ఆ ప్రాంతానికి వచ్చి అందరికీ దారి చూపారు. విఠలరాయుడు ఆ విగ్రహాన్ని భుజాలకెత్తుకుని నడిచారు. 'నాట్టార్‌కుళం' అనే ప్రాంతాన్ని చూపించి స్వామివారికి ఆలయం నిర్మించమని గరుడాళ్వార్ ఆదేశించి మాయమయ్యారు. విఠలరాయుడు అక్కడ అందమైన ఆలయాన్ని నిర్మించి ఆ ప్రాంతానికి 'విఠిలాపురం' అనే పేరుపెట్టారు. ఆలయం చుట్టూ ఇళ్ళు నిర్మించి ప్రజలకు కేటాయించారు. దీంతో అప్పటి దాకా నిర్మానుష్యంగా ఆ ప్రాంతం జనావాస ప్రాంతంగా మారింది. విఠలరాయుడు ప్రతినిత్యం స్వామివారిని సేవించేవారు. ఓ రోజు స్వామివారు ఆ రాజు ఎదుట ప్రత్యక్షమై ఏం వరం కావాలో వేడుకోమన్నారు. విఠలరాయుడు స్వామివారిని నమస్కరించి తనకంటూ కోరికలు ఏవీ లేవని, ఆలయానికి వచ్చే భక్తులకు సకలసౌభాగ్యాలు కల్పిస్తే చాలని కోరగా, స్వామి 'తథాస్తు' అని పలికి అంతర్థానమయ్యారు. అప్పటి నుండి ఆ ప్రాంతానికి 'తెన్ పండరీపురం' అనే పేరొచ్చింది.



గరుడాళ్వార్

ముఖమండపం





ప్రాకారమండపం

ఆలయ ప్రవేశద్వారం





ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో మార్గశిర మాసంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ ఆలయం 'భూలోకవైకుంఠం'గా పరిగణింపబడుతుండటంతో ఆలయంలో పరమపదవాసల్ (స్వర్గద్వారం) ఉండదు. విఠిలాపురంలో నమ్మాళ్వార్ వేంచేసినప్పటి నుండి ఈ ఆలయం ప్రఖ్యాతి గాంచింది. ఈ స్వామివారిని పురందరదాసు, నామదేవుడు, తుకారం, జ్ఞానదేవుడు వంటి పురాణపురుషుల వారసులు ప్రతియేటా దర్శించి వెళ్తున్నారు. సంగీతం, నాట్యంలో శిక్షణ పొందినవారు అరంగేట్రానికి ముందుగా ఈ ఆలయంలో పాండురంగ విఠలుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఆలయంలో భక్తులు జున్నుపాలు, క్షీరపాయసం నైవేద్యంగా సమర్పిస్తుంటారు. వివాహం, సంతాన ప్రాప్తి కోసం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి పాండురంగ విఠలుడి అనుగ్రహం పొందుతున్నారు.



షోడశ స్తంభాల మండపం

ఆలయ వైభవం...

మూలవిరాట్టు పాండురంగ విఠలుడనే నామధేయంతో దక్షిణాభిముఖంగా నిలిచి భక్తకోటికి దర్శనమిస్తున్నారు. స్వామివారి చెంతనే రుక్మిణీ, సత్యభామ కూడా పూజలందుకుంటున్నారు. ఉత్సవమూర్తి 'పాండురంగర్' అనే పేరుతో చతుర్భుజాలతో ఉన్నారు. రెండు హస్తాలతో నడుము పట్టుకుని, మరో రెండు చేతుల్లో శంఖు, చక్రం ధరించి ఉన్నారు. పాండురంగడి చెంతనే రుక్మిణీ, సత్యభామ, భూదేవి, శ్రీదేవి, నీలాదేవి విగ్రహాలున్నాయి. ఆలయం ముందు షోడశ (16) స్తంభాల మండపం, ఆ తర్వాత మహామండపంలో బలిపీఠం, ధ్వజస్తంభం ఉన్నాయి. ధ్వజస్తంభం ప్రాచీన శిల్పకళతో అలరారుతుంటుంది. ఈ ధ్వజస్తంభానికి చేరువలోనే గరుడాళ్వార్ సన్నిధి పశ్చిమాభిముఖంగా ఉంది. ఈ ఆలయంలోని స్తంభాలపై వివిధ దేవతామూర్తుల శిల్పాలు తిరునల్వేలి జిల్లా కృష్ణాపురం కళాత్మకకు కొత్త బాణీ అందించాయని శిల్పకళా నిపుణులు చెబుతారు. ఆలయ వెలుపల ప్రాకారంలో ఏనుగు ప్రదక్షిణ చేయడం వల్ల ఈ ఆలయ ప్రాంతాన్ని 'హస్తగిరి' అని కూడా పిలిచేవారు.

ప్రాచీన శిల్పకళ ఉట్టిపడుతున్న అంతరాలయ ప్రాకార మండపం

ఎలా వెళ్ళాలి?

రాజధాని నగరం చెన్నై నుంచి బస్సులు, రైళ్లలో తూత్తుకుడి, తిరునల్వేలి నగరాలకు వెళ్తే అక్కడి నుండి విఠిలాపురానికి వెళ్లేందుకు టౌన్ బస్సులున్నాయి. తిరునల్వేలి జంక్షన్ నుండి టౌన్ బస్ సదుపాయం కూడా ఉంది. ఈ ఆలయాన్ని ప్రతి రోజూ ఉదయం 6 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.





అంతర ప్రాకారం - విఠలరాయ చక్రవర్తి నిర్మించిన నివాసగృహాలు

స్టాలిన్‌తో ప్రేమలత భేటీ



సీఎం స్టాలిన్, ఆయన సతీమణి దుర్గ, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని కలుసుకున్న ప్రేమలత, ఆమె సోదరుడు సుదీష్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత గురువారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆళ్వార్‌పేటలోని నివాసంలో స్టాలిన్‌తో ఆమె భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి సతీమణి దుర్గ, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి ఈవీ వేలు, ప్రేమలత సోదరుడు ఎల్కే సుదీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న స్టాలిన్‌ను పరామర్శించడానికే వచ్చానని, ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవన్నారు. స్టాలిన్ తండ్రి కరుణానిధి, తన భర్త విజయకాంత్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారని, స్టాలిన్ కూడా తమతో సఖ్యతగానే ఉంటున్నారని చెప్పారు. ప్రస్తుతం పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నానని, జనవరి 9న జరిగే పార్టీ మహానాడు అనంతరం, ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటామనే విషయమై ఎన్నికల సమయంలో ప్రకటిస్తానని చెప్పారు.

ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు

● వీఐటీ సదస్సులో పారిశ్రామికవేత్త శక్తివేల్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భారత్-యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదరడంతో ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు ప్రపంచ మార్కెట్లను అన్వేషించడానికి అపారమైన అవకాశాలు పొందుతారని ప్రముఖ పారిశ్రామికవేత్త, పాపిస్ నిట్‌వేర్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎ.శక్తివేల్ పేర్కొన్నారు. గురువారం వీఐటీ చెన్నై 15వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వీఐటీ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నేతృత్వంలో 'ఫ్యాషన్ దుస్తుల్లో వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, స్థిరత్వం' అనే అంశంపై అంతర్జాతీయ సమావేశం, 'ఎన్‌విజన్25' పేరుతో అంతర్ కళాశాలల పోటీ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శక్తివేల్ మాట్లాడుతూ.. విద్యార్థుల నూతన ఆవిష్కరణలను పరిశ్రమలు స్వీకరించాలని, సమగ్రతను నిలబెట్టుకుని, స్థిరత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి యూకేకు చెందిన న్యూకాజిల్ నార్తుంబ్రియా స్కూల్ ఆఫ్ డిజైన్ ప్రొఫెసర్ డాక్టర్ అన్నే పీర్సన్-స్మిత్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీఐటీ వ్యవస్థాపకులు డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. కాలుష్యాన్ని తగ్గించడంలో, స్థిరమైన అభివృద్ధిని పెంపొందించడంలో వృత్తాకార ఆర్థిక వ్యవస్థ కీలక పాత్ర ఉందన్నారు. ఇతర దేశాలకు ఎగుమతుల విషయంలో చైనాతో భారత్ పోటీ పడాలన్నారు. వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం భారతీయ వస్త్రధారణకు సంబంధించిన సాంస్కృతిక ప్రాముఖ్యత వివరించారు. ఈ సమావేశంలో వీఐటీ చెన్నై యూకేలోని నార్తుంబ్రియా స్కూల్ ఆఫ్ డిజైన్, ఆర్ట్స్ అండ్ క్రియేటివ్ ఇండస్ట్రీస్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఇది విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడికి, అలాగే స్థిరమైన ఫ్యాషన్, డిజైన్‌లో సహకార పరిశోధనకు మార్గం సుగమం చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో వీఐటీ చెన్నై ప్రొ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్, వీఐటీ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ టి.పళనిరాజన్ తదితరులు పాల్గొన్నారు.



'ఎన్‌విజన్25' ప్రారంభోత్సవంలో నిర్వాహకులు, అతిథులు

'నమ్మ స్టోరీస్' షార్ట్ ఫిల్మ్ పోటీ

అడయార్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ డే వేడుకలను పురస్కరించుకుని 'నమ్మ స్టోరీస్' పేరుతో షార్ట్ ఫిల్మ్ కంటెస్ట్‌ను సూపర్ చెన్నై ప్రారంభించింది. ఇందుకోసం నగరవాసులు ఈ నెల 15వ తేదీలోగా స్క్రిప్టులను చేరవేయాల్సి ఉంటుంది. ఈ షార్ట్ ఫిల్మ్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ అర్హులేనని తెలిపింది. ఇందులో ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌కు లక్ష రూపాయల బహుమతి కూడా అందజేస్తామని సూపర్ చెన్నై నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో భాగంగా, చెన్నై నగరానికి చెందిన పాత జ్ఞాపకాలు, నాటి మధుర స్మృతులు, జీవితాలు, రోజువారీ జీవన పోరాటం తదితర అంశాలపై చిన్నపాటి షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించి "hello@superchennai.com' అనే చిరునామాకు పంపాలని నిర్వాహకులు గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల తర్వాత విజయ్ మళ్ళీ సినీ రంగానికే...!

● మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే గెలిచి కొత్త చరిత్ర సృష్టిస్తుందని చెబుతున్న సినీనటుడు విజయ్ ఆ ఎన్నికల తర్వాత మళ్ళీ సినీ రంగానికే పరిమితమవుతారని రాష్ట్రమంత్రి పీకే శేఖర్‌బాబు అన్నారు. సీఎండీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఉదయం ఆయన అధికారుల తోపాటు పరిశీలించారు. పెరంబూరులో నిర్మిస్తున్న సామాజిక సంక్షేమ కేంద్రం, కొళత్తూరు నియోజకవర్గం పరిధిలోని తిరువికనగర్ బస్టాండు నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. మంత్రితోపాటు మేయర్ ప్రియ, అధికారులు కూడా ఉన్నారు.



బస్టాండు పనులను పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ

ప్రభుత్వ సంక్షేమశాఖ పాఠశాలల్లో పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుని జాతీయ స్థాయి విద్యాసంస్థలలో అడ్మిషన్లు పొందిన ఆదిద్రావిడ, గిరిజన కులాలకు చెందిన విద్యార్థులకు సచివాలయంలో ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి →





సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న దక్షిణ భారత ప్రాంతీయ సైన్యాధ్యక్షులు లెఫ్టినెంట్ జనరల్ కేఎస్ బ్రార్







తిరుమల.. పచ్చని సోయగాల మాల

ఇల వైకుంఠంగా భక్తులు భావించే తిరుమల గిరులు పచ్చదనంతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలకు చెట్లన్నీ చిగురించి ఈ ఆధ్యాత్మిక ప్రాంతానికి కొత్త వన్నెలద్దాయి. భక్తులను ఆహ్లాదంతో పులకరింపజేస్తున్నాయి. గుండెనిండా భక్తి నింపుకొని ఏడుకొండలను చేరుకుంటున్నవారు హరితకాంతలా మారిన తిరుమల కొండలను చూసి తన్మయత్వం చెందుతున్నారు. ప్రకృతి ప్రియులు ఈ నయనమనోహర అందాలను ఆస్వాదిస్తూ తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. శేషాచలంతో పాటు సమీపంలోని ఎస్వీ యూనివర్సిటీ లాంటి ప్రాంతాలు కూడా పచ్చదనాన్ని పరుచుకుని కనువిందు చేస్తున్నాయి.

మెరిసిన మన ఆణిముత్యాలు

● తడుకు విద్యార్థుల 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి

తిరుపతి(విద్య), జూలై 31(ఆంధ్రజ్యోతి): మన జిల్లా విద్యార్థులు ఢిల్లీలో మెరిశారు. మన విజ్ఞాన వీచికలు జాతీయ స్థాయి వేదికలపై జిల్లా పేరును మార్మోగించాయి. మన జిల్లా విద్యార్థులు రూపొందించిన నమూనా ఏకంగా పేటెంట్ హక్కు గడప తొక్కనుంది. వడమాలపేట మండలం తడుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్' సైన్స్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకుని రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.

జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గ నిర్దేశంలో తడుకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ సోలార్‌తో పనిచేసే 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'ను రూపొందించారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కుగాను 2024 జూలైలో పోటీలు నిర్వహించగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 1,00,400 ప్రాజెక్టులు పోటీలో నిలిచాయి. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టుల స్క్రీనింగ్ ఐదు దశల్లో వడపోయగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వాటిలో రాష్ట్రం నుంచి రెండు ఎంపికకాగా అందులో తడుకు విద్యార్థుల ప్రాజెక్టు ఒకటి. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని గాల్గొటీ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శన-వర్క్‌షాప్-2025 జరిగింది. ఈ ప్రదర్శనకు జిల్లా విద్యార్థుల సైన్స్ ప్రాజెక్ట్‌తోపాటు మొత్తం 39 ప్రాజెక్టులు పోటీపడ్డాయి. వీటిలో సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏఐసీటీయూ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇళంగోవన్ కరియప్పన్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌ను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. మినీ ఫాస్ట్ కంపోస్టర్‌కు పేటెంట్ హక్కు పొందేందుకు ప్రతిపాదిస్తామని ప్రకటించారు. కాగా, మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.90,500 ప్రకటించింది.





సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ - ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

పరికరం.. ఎంతో ఉపయుక్తం

మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరం ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయల నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఇది సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. బాక్టీరియా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడానికి కావాల్సిన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ విధానంలో కీటకాలు అభివృద్ధి చెందకుండా కూడా ఈ విధానం పనిచేస్తుంది. ప్రస్తుతం గృహావసరాలకు సరిపడేలా రూపొందించిన ఈ పరికరాన్ని పెద్దఎత్తున వ్యాపార అవసరాలకు వినియోగించేలా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో అభివృద్ధి చేయనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.99 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,303

తలనీలాలు సమర్పించినవారు: 27,166



సాంకేతిక పరిజ్ఞానంతో అధిక ఆదాయం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌పీవోలు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల(ఎఫ్‌పీవో) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పనిచేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా చిరుధాన్యాల సాగుపైనా దృష్టి సారించాలన్నారు. ఉద్యాన పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. ఆయిల్‌పాం, ఆక్వా రంగంలోనూ మంచి రాబడులు వస్తున్నాయని వివరించారు. అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు ద్వారా తీసుకువచ్చే నూతన వ్యవసాయ మార్పులపై సుదీర్ఘంగా వివరించారు. రైతులకు ఉపయోగపడే సమాచారంతో వచ్చిన ఏపీఏఐఎంఎస్ సరికొత్త మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో పరిశోధనలపై దృష్టి సారించండి

● ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య



ఐసర్‌లో జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నూతన ఆలోచనలతో పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించి రసాయన పద్ధతులు సాంకేతికతల వంటి అంశాలపై చర్చించాలని ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య సూచించారు. ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న ఐసర్ ప్రాంగణంలో జూలై 29, 30వ తేదీల్లో జాతీయ సదస్సు జరిగిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండర్ రీసెర్చ్(ఐసర్) తిరుపతి రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సస్టైనబిలిటీ కోసం రసాయన శాస్త్రం అనే జాతీయ సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సుస్థిర రసాయన పద్ధతులపై కొత్త పరిశోధనలు, ఆలోచనలు పంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 18 ప్రత్యేక ఉపన్యాసాలు జరిగాయి. వీటిలో పదార్థ శాస్త్రం, ఎలక్ట్రో కెమెస్ట్రీ, పచ్చ రసాయన పద్ధతులు, శక్తి నిల్వ సాంకేతికతల వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో 300 మందికి పైగా పీజీ విద్యార్థులు, పరిశోధకులు, పోస్ట్ డాక్టరల్ ఫెలోస్ ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్త కావాలి : కలెక్టర్

● పొదుపు సంఘాల్లో అవకతవకలు నివారించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్త ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మహిళా పొదుపు సంఘాల్లో అవకతవకలు జరగకుండా ఖాతా పుస్తకాలు ఎప్పటికప్పుడు రాయించాలని ఆదేశించారు. గురువారం తిరుపతిలోని ఓ హోటల్లో ఎంటర్‌ప్రెన్యూర్స్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి సంఘంలోని సభ్యులు జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, దాన్ని సాధించే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. గ్రూపుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ సీజ్


పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

రేణిగుంట, జూలై 31(ఆంధ్రజ్యోతి): చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తుండగా పోలీసులు రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. స్టేషన్ రైటర్ చలపతి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి మండలంలోని వేదాలచెరువు గ్రామంలోని చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులను చూసి కొంతమంది పారిపోయారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1,200 ఓటర్లు దాటిన తర్వాత అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీఆర్వో నరసింహులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో గురువారం పోలింగ్ కేంద్రాల సరళీకరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 33 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పేర్లు మార్పు కోసం 8 కేంద్రాలను గుర్తించామని తెలిపారు. 1,200 మంది ఓటర్లు దాటిన 162 కేంద్రాలను గుర్తించామన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు.

రాష్ట్రంలో అలజడికి సృష్టించడానికి జగన్ వ్యూహం

● వైసీపీ యాప్ తెస్తే ఆవేదన చెప్పడానికి సిద్ధంగా మద్యం బాధితులున్నారన్న శాప్ ఛైర్మన్



తిరుపతి(జీవకోన), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడిప్పుడే రాష్ట్రం గాడిన పడుతుంటే.. అలజడి సృష్టించడానికి వైసీపీ అధినేత జగన్ వ్యూహం పన్నారని శాప్ ఛైర్మన్ రవి నాయుడు ఆరోపించారు. నెల్లూరు పర్యటనలోనూ కార్యకర్తలను రెచ్చగొట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ, అధికారులను భయపెట్టేందుకు యాప్ తెస్తానంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. యాప్ తెస్తే వైసీపీ ప్రభుత్వంలో మద్యం ద్వారా ఛిన్నాభిన్నమైన 30 వేల కుటుంబాలతో పాటు బాధితులెందరో తమ ఆవేదన చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యం నాలుగు పాదాలపై నడిచిందని మంత్రి రోజా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే ఎగరేసి తంతామంటూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఎగిరెగిరి మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోమని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఎపుడైనా మహిళలా రోజా ప్రవర్తించారా అని ఆయన ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని, త్వరలోనే మరో కుంభకోణం కూడా బయటకు వస్తుందని చెప్పారు. ఓ మంత్రి రోజాను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ మీడియా వారు ప్రశ్నించగా అలాంటి వాటికి అవకాశం ఉండదని ఈ శాఖలో తాను ఉన్నానంటూ చెప్పుకొచ్చారు.

సెల్‌ఫోన్ దొంగిలించారంటూ దాడి

● అవమానం భరించలేక మహిళ ఆత్మహత్య ● ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


ప్రసన్న (ఫైల్ ఫొటో)

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లో సెల్‌ఫోన్ దొంగలించారంటూ పక్కింటి మహిళపై అనుమానం పెట్టుకున్నారు. తరచూ వేధించారు. నానా మాటలన్నారు. చివరకు దాడి చేశారు. ఆ అవమానం భరించలేక ప్రసన్న (30) ఆత్మహత్య చేసుకుంది. ఏర్పేడు మండలం మన్నసముద్రంలో 25 రోజుల కిందటి ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన ప్రకారం.. మన్నసముద్రంకు చెందిన గోడల కృష్ణయ్య, నారాయణమ్మ దంపతుల కుమార్తె ప్రసన్నకు, దొరవారి సత్రం మండలానికి చెందిన పోలయ్యకు వివాహమైంది. వీరికి ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ప్రసన్న తన పుట్టింటికి వచ్చారు. జూన్ 30న గంగమ్మ ఇంట్లో సెల్‌ఫోను కనిపించకుండా పోయింది. ఆమె ప్రసన్నపై అనుమానం పెట్టుకుని తిట్టేది. ఈ క్రమంలో జూలై 2న గంగమ్మ కుటుంబీకులు దాడి చేయగా, ప్రసన్న తీవ్రంగా గాయపడ్డారు. దాడి, దొంగతనం నెపం వేశారనే బాధ భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబీకులు తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జూలై 5న మృతి చెందారు. తమ కుమార్తెను అవమానించి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ కృష్ణయ్య జూలై 10వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారించిన పోలీసులు గంగమ్మతో పాటు ఆమె కుటుంబానికి చెందిన సుబ్రహ్మణ్యం, గురవయ్య, గంగమ్మ, శైలజ, పాపమ్మ, చిట్టెమ్మ, మణెమ్మపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే కేసు నమోదు

తమ కుమార్తె ప్రసన్న ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన 15 రోజుల వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని కృష్ణయ్య అంటున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిశామన్నారు. ఆయన చొరవతోనే కేసు నమోదైందని అంటున్నారు. కాగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి స్వగ్రామంలో.. తమ ఇంటి పక్కన ప్రసన్న ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాన్ని ఇప్పటి వరకు ఎంపీ పరామర్శించలేదని బంధువులు ఆరోపిస్తున్నారు.

12న బీజేపీ 'సారథ్యం'

● రాష్ట్ర పర్యటనలో భాగంగా జిల్లాకు రానున్న మాధవ్


రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'సారథ్యం' కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆగస్టు12న తిరుపతి నగరం, జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి నగరం రాఘవేంద్రనగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ఆధునికీకరించి.. గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సామంచి మాట్లాడుతూ.. సారథ్యం కార్యక్రమం ఉదయం ఆర్ఎస్ఎస్ శాఖతో ప్రారంభమవ్వై.. స్థానిక ప్రజలతో చాయ్‌పే చర్చ ఉంటుందని చెప్పారు. తర్వాత బీజేపీ నేతలు, కార్యకర్తలతో పాదయాత్రగా కచ్చపి ఆడిటోరియంకు చేరుకుంటారని, కార్యకర్తలతో విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. సాయంత్రం జిల్లాలోని ప్రముఖ పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో సమావేశమవుతారన్నారు. ఈ సందర్భంగా మాధవ్ పర్యటన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండ్రిగ ఉమ, చంద్రారెడ్డి, ఎస్ఎస్ఆర్ నాయుడు, కోటేశ్వరరావు, నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలాజీ, డాక్టర్ నరేష్‌బాబు, సత్యవేడు మునిక్రిష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అనూష రామకృష్ణ, నరేంద్రరెడ్డి, మల్లకుప్పం శేఖర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు ట్రోఫీల బహూకరణ


ట్రోఫీలతో బ్యాడ్మింటన్ పోటీల విన్నర్స్, రన్నర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీల విజేతలకు గురువారం ట్రోఫీలు బహూకరించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసి, అభినందించారు. ఇక్కడ విజయం సాధించిన వారు డిసెంబర్‌లో విజయవాడలో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్‌ను చిత్తూరు బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

విజేతల వివరాలిలా...

● **మిక్స్‌డ్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.నవ్య(చిత్తూరు)లపై హేమచంద్రన్‌సెల్వం, కవిప్రియసెల్వం(విశాఖపట్నం) విజయం

● **ఉమెన్ డబుల్స్** : ఎ.హర్షిక, ఎ.ప్రవల్లికమణి(విశాఖపట్నం)లపై డి.దీపిక, డి.స్రవంతి(గుంటూరు) గెలుపు

● **మెన్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.విష్ణుకేదార్(ప్రకాశం)లపై ఎ.భార్గవరామ్(గుంటూరు), జి.వి శ్వతేజ్(కడప) విజయం. ● **ఉమెన్ సింగిల్స్** : ఎం.తనిష్క(గుంటూరు)పై కె.నవ్య(చిత్తూరు) గెలుపు. ● **మెన్ సింగిల్స్** : టి.అనిష్‌డేనియల్(నెల్లూరు)పై కె.మోహిత్(తూర్పుగోదావరి)విజయం.

10మంది ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ. 6 లక్షల వంతున జరిమానా

తిరుపతి(నేరవిభాగం),జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో 10 మంది ముద్దాయిలకు ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. వివరాలిలా...2019లో పెరుమాళ్ల పల్లి బీటు పరిధిలోని ఎస్వీఎన్‌పీ డివిజన్‌లో తమిళనాడులోని తిరువన్నామలై, వేలూరు జిల్లాలకు చెందిన సి.విశ్వనాథ్, డి.సేతు, డి.రమేష్, ఎం.సంపత్, వి.రత్నం, బూచాయాన్, జె.కుమార్, సి.ప్రభు, సురేష్, సి.రామర్‌లు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆరేళ్ళ పాటు కేసు విచారణ దశలో ఉన్న ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 10 మంది స్మగ్లర్లకు ఐదేళ్ళ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో అధికారులు కఠిన శిక్ష పడేలా సాక్ష్యాధారాలను నిరూపించడంలో సఫలీకృతులయ్యారు.

డ్రగ్స్ నివారణకు సహకరించండి

- ఈగల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ -

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణకు అందరూ సహకరించాలని పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూ లా, ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ఈగల్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, కలిగి ఉన్నా, వాడినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. దీనిపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. డ్రగ్స్ గురించి 1972 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఎవరైనా సమాచారం అందించవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఎస్వీయూ పీఎస్ ఎస్ఐ కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్